01032025-DIS-04_Layout 1 3/1/2025 4:18 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# రైజింగ్‌ను అడ్డుకుంటున్నది రేవంతే!



బుద్ధా మురళి

**'తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్నారు. నిజమే, వారు చెప్పింది అక్షర సత్యం. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు. తెలంగాణ ఉద్యమం కూడా తెలంగాణ రైజింగ్‌ను ఆపలేకపోయింది. అయితే, ఒక్క ప్రభుత్వానికే తెలంగాణ రైజింగ్‌ను ఆపే శక్తి ఉన్నదని సీఎం రేవంత్ నిరూపిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇండ్ల అమ్మకాలు 22 శాతం తగ్గాయి. అన్నిరకాల ఆదాయాలు పడిపోయాయి. హైదరాబాద్ శివారు గ్రామాల్లో ఎన్నికలకు ముందు ఎకరం భూమి ధర రూ.2 కోట్లు పలికినా ఇప్పుడు కోటికైనా కొనేవారు లేరు. అన్ని చోట్లా ఇలా 50 శాతం వరకు ధరలు పడిపోయాయి. మహా నగరంలో అపార్ట్‌మెంట్లు కట్టి అమ్ముడు పోవడం లేదని బిల్డర్ ఆత్మహత్య చేసుకున్న ఘనత రేవంత్ ప్రభుత్వానికే దక్కుతుంది. నిజమే తెలంగాణ రైజింగ్‌ను ఆపే శక్తి ఎవరికీ లేదు. పాలకుడు కాబట్టి ఆ శక్తి ఒక్క రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే ఉన్నది. గత ఏడాదిన్నర నుంచి ఆ శక్తిని చూపిస్తున్నారు కూడా.**

ఒక మహిళా జర్నలిస్ట్ ఫోన్ చేసి 'నా సోదరికి క్యాన్సర్ వ్యాధి సోకింది. చికిత్స కోసం నెలకు కనీసం రూ. లక్ష ఖర్చవుతున్నది. నా సోదరి ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ పొంది ఏడాది గడుస్తున్నది. కానీ, ప్రభుత్వం ఇంకా బెనిఫిట్స్ ఇవ్వలేదు. సీఎంఆర్ఎఫ్ నుంచి సహాయం కోరుదామా అంటే నా సోదరి ప్రభుత్వ ఉద్యోగిని. కాబట్టి ఆ స్కీం వర్తించదు. ఇప్పుడు ఆమె ఏం చేయాలి' అని ఆవేదన చెందుతున్నది. ఇదీ ఒక ప్రభుత్వ ఉద్యోగి పరిస్థితి. ఇలాంటివారు రాష్ట్రంలో వందల మంది ఉన్నారు. రిటైరైన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు దాదాపు రూ.10 వేల కోట్లు. రాష్ట్రంలో కోటి మంది సామాన్య మహిళలను కోటీశ్వరులను చేయడానికి అలుపెరగకుండా శ్రమిస్తున్న రేవంత్ ప్రభుత్వం పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి క్యాన్సర్ చికిత్సకు కూడా వారికి రావలసిన డబ్బులు వారికిచ్చే స్థితిలో లేదు. విదేశీ విద్యా పథకం కింద గత ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షలు ఇచ్చేది. మొదటి దశలో రూ.10 లక్షలు, 2వ దశలో మిగిలిన 10 లక్షలు ఇచ్చేది. గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన వారికి గతంలోనే 10 లక్షలు ఇచ్చారు. ఇప్పుడు వారి 2వ సెమిస్టర్ కూడా ముగిసింది. అయినా మిగిలిన 10 లక్షలు ఇవ్వలేదు. కొత్త జాబితా వెల్లడించలేదు. ప్రభుత్వ పోకడ ముందే గ్రహించిన బ్రాహ్మణ పరిషత్తు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విదేశీ విద్య కోసం దరఖాస్తులు తీసుకోవడం నిలిపివేసింది. బీసీ విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ఏడాదిన్నర నుంచి ప్రభుత్వం నుంచి ఉలుకు పలుకు లేదు. రేవంత్ సీఎం కాగానే విదేశీ విద్యా పథకాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దుతామని, ప్రపంచంలో అత్యున్నత యూనివర్సిటీల్లో చదువుకోవడానికి అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. బీసీ శాఖ మంత్రేమో ఇప్పుడిస్తున్న 350 మందికి సరిపోదు, దీన్ని కనీసం వెయ్యి మందికి ఇచ్చేట్టు విస్తరిస్తామన్నారు. 'నిధుల్లేవు, పథకాన్ని ఎత్తివేస్తున్నాం' అని నేరుగా చెప్పకుండా అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలు, మరింత ఎక్కువ మందికి ఇస్తామని చెప్తుంటారు. ఇది రాజకీయ భాష. ఉద్యోగాన్ని ఊడబెరికి ప్రభుత్వరంగ సంస్థను మూసేయడాన్ని గోల్డెన్ షేక్ హ్యాండ్ అని ముద్దుగా పిలిచినట్టు పథకాలను నిర్వీర్యం చేసే రాజకీయ భాష ఇది.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రం పార్క్‌లో ప్రభుత్వ ఉద్యోగులు వాకింగ్ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఆలస్యంగా ఇస్తూ రైతుబంధు, దళితబంధు, పింఛన్‌లకు నిధులు మళ్లిస్తే మా తడాఖా చూపించామని ముచ్చటించుకోవడం వినిపించింది. అప్పుడు జీతం వారం రోజులు ఆలస్యమైందేమో కానీ, ఇప్పుడు జీతం ఆలస్యమే కాదు, చివరికి క్యాన్సర్ వచ్చినా చికిత్స చేసుకోవడానికి రిటైరైన వారికి డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదు. ఒక వైపు దళితబంధు లేదు, సగం సగం రైతుబంధు.

పద్నాలుగేండ్ల పాటు సాగిన తెలంగాణ ఉద్యమం తెలంగాణ కోసం ఉద్యమించింది కానీ, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకొనే ఒక్క పని కూడా చేయలేదు. ప్రధానంగా ఉద్యమ కాలంలో హైటెక్ సిటీ వైపు వెళ్లలేదు. ఉద్యమం ఉధృతంగా సాగుతున్నప్పుడు ఐటీ రంగంతో పాటు హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రుల వ్యాపారాల సంగతి ఏమిటనే ప్రశ్నలు ఉదయించాయి. చివరికి జలదృశ్యంలో ఉన్న టీఆర్ఎస్ కార్యాలయాన్ని చంద్రబాబు ప్రభుత్వం రాత్రికి రాత్రి రోడ్డున పడేస్తే మౌనంగా కార్యాలయ ఫర్నిచర్‌ను మరో అద్దె భవనంలోకి మార్చారు కానీ, దౌర్జన్యానికి దిగలేదు. దేశం దృష్టిని, ప్రపంచం దృష్టిని ఆకర్షించిన ఉధృత ఉద్యమ సమయంలో కూడా తెలంగాణ అభివృద్ధిని ఏ ఉద్యమ సంస్థ, ఏ ఉద్యమకారుడు అడ్డుకోలేదు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉన్న కోదండరాం బృందం నాటి పిలుపు మేరకు ట్యాంక్‌బండ్‌పై తెలుగు వారి విగ్రహాల కూల్చివేత జరిగింది. ఈ కార్యక్రమంలో కేసీఆర్ పాల్గొనలేదని, అక్కడి మీటింగ్‌లోనే కోదండరాం బృందం కేసీఆర్‌పై బహిరంగ విమర్శలు చేశారు. ఈ ఒక్క సంఘటన తప్ప ఉద్యమంలో అభివృద్ధిని అడ్డుకొనే ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదు.



అలాంటిదిప్పుడు తెలంగాణ అభివృద్ధిని ఎవరో అడ్డుకుంటున్నారన్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేర'ని ప్రకటించడమే విడ్డూరం. అనేక మీటింగ్‌లలో యాంకర్‌లు సీఎం పేరు కూడా మరిచిపోతున్నారు. చివరికి సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా సీఎం పేరు గుర్తుకురాక సీఎం కేటీఆర్ అంటూ మీడియా సమావేశంలో మాట్లాడారు. మంత్రివర్గ సహచరులపైనే సీఎం చూపించిన ప్రభావం అది.

> **హైదరాబాద్ అభివృద్ధి అంటే తెలంగాణ అభివృద్ధి. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేండ్ల టీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ భూములతో పోటీ పడి తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రైతు అంటే చిరిగిన దుస్తులతో, మాసిన గెడ్డంతో నిరాశగా ఆకాశం వైపు వర్షం కోసం చూసే బడుగుజీవి అనే ముద్ర బలంగా ఉండేది. అలాంటి రైతు కూడా అర ఎకరం అమ్ముకొంటే పిల్ల పెళ్లి అద్భుతంగా చేస్తానని ధీమాగా పలికే పరిస్థితి వచ్చింది. అలాంటిదిప్పుడు ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ కూడా పడకేసింది.**

ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే రాచకొండలో కొత్త నగరాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో రాచకొండలో కొత్త నగర నిర్మాణం గురించి ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు ఫ్యూచర్ సిటీపై మాట్లాడుతున్నారు. నగరానికి ఆనుకొని ఉండటం వల్ల హైటెక్ సిటీ వెంటనే అభివృద్ధి చెందింది. అంతే కానీ, నగరం దాటి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫ్యూచర్ సిటీ నగరంగా ఏర్పడటం అంత ఈజీ కాదు. కాంగ్రెస్‌లో ఏడాదిన్నర అంటే సుదీర్ఘ కాలం. కాంగ్రెస్ పరిశీలకులు మారారు. ఒక్క వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే పూర్తికాలం సీఎంగా ఉండగలిగారు. కాంగ్రెస్‌లో ఎవరి ఫ్యూచర్ ఏమిటో ఎవరూ చెప్పలేరు. సీఎం ఫ్యూచర్‌కే గ్యారెంటీ లేనప్పుడు ఫ్యూచర్ సిటీ భవిష్యత్తు ఏమిటో ఎలా చెప్పగలం? డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు రంగులు మార్చి ఇందిరమ్మ ఇండ్లు అని కేటాయించడం తప్ప ఇప్పటివరకు కొత్తగా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా నిర్మించలేదు.

కేసీఆర్ ప్రారంభించారనే అక్కసుతో ఫార్మా సిటీని రద్దుచేశారు. ఫార్మా సిటీపై ప్రత్యేకంగా దృష్టిసారించి ఉంటే ఐటీ ద్వారా లక్షల మందికి ఉపాధి లభించినట్టు భవిష్యత్తులో ఫార్మా రంగంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించి ఉండేవి. ఉమ్మడి రాష్ట్రంలో 2004 ఎన్నికల సమయంలో వైఎస్ఆర్ గెలుపు ఖాయమని తేలిపోయింది. ఆ సమయంలో కాంగ్రెస్ గెలిస్తే హైదరాబాద్‌లో ఐటీ రంగం భవిష్యత్తు ఏమిటనే సందేహాలు బయల్దేరాయి. అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని వైఎస్ ప్రకటించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మరోసారి ఇలాంటి సందేహాలే వినిపించాయి. అయితే ఆ పదేండ్ల కాలంలో చంద్రబాబు, వైఎస్ కాలంలో కన్నా ఐటీ రంగం ఎక్కువగా అభివృద్ధి చెందింది. రాజకీయాలు ఎలాగైనా ఉండవచ్చు. రాజకీయ ప్రయోజనాలు, అహంకార వైఖరితో తెలంగాణ గుండెకాయను గాయపరిచే పనులు చేపట్టవద్దు. హైదరాబాద్ అభివృద్ధికి తద్వారా తెలంగాణ ప్రయోజనాల కోసం సీఎంగా రేవంత్ కృషిచేయాలి కానీ, అన్నింటిని చెరిపేస్తాను, కూల్చేస్తానంటూ విధ్వంసానికి పాల్పడవద్దు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్‌తో పాటు ఏయే రంగాలు దెబ్బతిన్నాయో, ఎందుకు దెబ్బతిన్నాయో సమీక్షించి ఆ రంగాల అభివృద్ధిపై దృష్టిసారించాలి. హైదరాబాద్‌లోనే తెలంగాణ ప్రాణం దాగి ఉన్నది. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపడం లేదు. అధికారం చేతిలో ఉండటం వల్ల తెలంగాణ రైజింగ్‌ను ఆపే శక్తి మీకు ఉండవచ్చు కానీ, ఆ అధికారాన్ని తెలంగాణ అభివృద్ధికి ఉపయోగిస్తే మంచిది.

> **ఉమ్మడి రాష్ట్రంలో 2004 ఎన్నికల సమయంలో వైఎస్ఆర్ గెలుపు ఖాయమని తేలిపోయింది. ఆ సమయంలో కాంగ్రెస్ గెలిస్తే హైదరాబాద్‌లో ఐటీ రంగం భవిష్యత్తు ఏమిటనే సందేహాలు బయల్దేరాయి. అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని వైఎస్ ప్రకటించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మరోసారి ఇలాంటి సందేహాలే వినిపించాయి. అయితే ఆ పదేండ్ల కాలంలో చంద్రబాబు, వైఎస్ కాలంలో కన్నా ఐటీరంగం ఎక్కువగా అభివృద్ధి చెందింది. రాజకీయాలు ఎలాగైనా ఉండవచ్చు. రాజకీయ ప్రయోజనాలు, అహంకార వైఖరితో తెలంగాణ గుండెకాయను గాయపరిచే పనులు చేపట్టవద్దు.**

# సావుబాట పడుతున్న రైతన్న



## నడుము విరిగె

ఆ.వె.॥
కాంగిరేసువచ్చి కష్టాలు తెచ్చేను
మభ్య పెట్టు చంద్రు మంత్రులంత
నీటి మీది రాత నాటివాగ్దానాలు
నమ్మి నట్టి ప్రజల నడుము విరిగె

ఆ.వె.॥
ఇచ్చి నట్టి మాట పచ్చి తప్పేనులే
ఓట్ల కొరకు నాడు కోట్ల కొలది
పలుకు లెన్నొ పలికి ప్రజలను ముంచిరి
నమ్మి నట్టి ప్రజల నడుము విరిగె

ఆ.వె.॥
రైతు బంధు లేదు మెతుకులు కరువాయె
చితికి పోయి బ్రతుకు చితికి పోయె
కూడు గూడు లేక కూలెను రైతులు
నమ్మినట్టి ప్రజల నడుము విరిగె



జాధవ్
పుండలిక్‌రావు పాటిల్
94413 33315



పులి రాజు
99083 83567

**భారతదేశంలో ప్రతి అరగంటకో రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడు. రోజుకు 2 వేల మంది రైతులు వ్యవసాయాన్ని వదిలిపెట్టి ఇతర రంగాలకు వలస వెళ్తున్నారు. మిగతావారు కూడా లాభాలు వస్తున్నాయని వ్యవసాయం చేయడం లేదు. ఉన్న ఊరును, కన్నతల్లిని, భార్యాపిల్లలను వదిలిపెట్టి ఇంకో ప్రాంతానికి వెళ్లలేక తప్పని పరిస్థితుల్లో వ్యవసాయం చేస్తున్నారు. ఆదాయ భద్రత లేని ఏకైక రంగం వ్యవసాయ రంగం. పెట్టుబడులు కూడా రాక, కుటుంబాన్ని పోషించుకోలేక, తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక పంటపొలాల్లోనే రైతులు ఉరికొయ్యలను ముద్దాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు రాష్ట్రంలో 435 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆదర్శ గ్రామం. ఈ గ్రామంలోని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మామిండ్ల కనకరాజు వయసు 27 సంవత్సరాలు. ఉన్న ఎకరా అసైన్డ్ భూమిలో నాలుగు బోర్లు వేస్తే ఒక్కటి మాత్రమే కొన్ని నీళ్లు పోస్తున్నది. ఆ బోర్‌లో మోటర్ పడిపోయి రాక పోవడంతో నెల రోజుల క్రితం కొత్త బోర్ వేసేందుకు రూ. 5 లక్షలు అప్పు చేశాడు. చివరికి అప్పు తీర్చే మార్గం లేక ఫిబ్రవరి 9న రాత్రి 11 గంటలకు పొలం వద్ద గడ్డిమందు తాగాడు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 16న రాత్రి 12 గంటలకు మృతి చెందాడు. కనకరాజు పేరు మీద పట్టా లేకపోవడంతో రైతు బీమా వర్తించదు. కనకరాజుకు భార్య రేణుక (23) ఆరేండ్ల కొడుకు భానుప్రసాద్, మూడేండ్ల బిడ్డ ప్రియాతోపాటు వృద్ధులైన తల్లిదండ్రులున్నారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం, గిరిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళిత రైతు బండారి రవీందర్ (30). ఉన్న ఎకరా పొలంతోపాటు రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పంటలు సరిగా పండక రూ. 6 లక్షలు అప్పు చేశాడు. అవి తీర్చే మార్గం కానరాక ఫిబ్రవరి 10న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రవీందర్‌కు భార్య అనిత, ముగ్గురు కుమార్తెలు స్నేహిత (6), లౌక్యశ్రీ (4), రిషిక (2) ఉన్నారు. రెండు నెలల క్రితం రవీందర్ తండ్రి మల్లయ్య సైతం ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతో రెండు నెలల వ్యవధిలో తండ్రీకొడుకులు ఆత్మహత్య చేసుకోవడంతో ఊరంతా శోకసంద్రంలో మునిగింది. కుటుంబానికి మగదిక్కు లేకుండా పోయింది.


జనగామ జిల్లా, నర్మెట మండల కేంద్రానికి చెందిన ముక్కెర బాలరాజు (35). అప్పుల బాధతో ఫిబ్రవరి 11న సొంత వరిపొలంలో ఉరి వేసుకున్నాడు. ఆయన భార్య భాగ్య, ఇద్దరు బిడ్డలు నవ్య (ఇంటర్), దివ్య (7వ తరగతి) ఉన్నారు. తనకు వారసత్వంగా వచ్చిన రెండెకరాల భూమితో పాటు తమ్ముడు పరుశరాములు నుంచి రెండెకరాలు కౌలుకు తీసుకుని వరి, పత్తి, మిర్చి పంటలు వేశాడు. ఫిబ్రవరి మొదటి వారంలో ఉన్న రెండు బోర్లు ఎండిపోవడం, హుస్నాబాద్ అంగడిలో రూ.1.5 లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ఆవు మూడు రోజులకే చనిపోవడం, వారం రోజుల్లో రెండు లేగదూడలు కూడా మృత్యువాత పడటం, మరోవైపు పంటలు ఎండిపోవడంతో చేసిన రూ. 8 లక్షల అప్పులు ఎలా తీర్చాలన్న ఆవేదనతో ఫిబ్రవరి 11న ఉదయం



6 గంటలకు పాలు పిండుకొస్తానని బావి వద్దకు వెళ్లి ఉరివేసుకున్నాడు. ఉదయం 8 గంటలైనా భర్త ఇంటికి రాకపోవడంతో భార్య భాగ్య ఫోన్ చేసింది. లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి బావి వద్దకు వెళ్లి చూస్తే కొట్టంలో భర్త ఉరి వేసుకుని కనిపించాడు.

రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యల్లో ఇవి కొన్ని మాత్రమే. మన దేశంలో సుమారు 63 శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా, ఇప్పటికీ సరైన వ్యవసాయ విధానం లేకపోవడం ప్రభుత్వాల చిత్తశుద్ధికి నిదర్శనం. 1995 నుంచి 2022 వరకు దేశవ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికలు చెప్తున్నాయి. ఉమ్మడి ఏపీలో తెలంగాణ ప్రాంతంలో పదేండ్లలో 16,494 మంది రైతులు చనిపోయినట్టు ఎన్‌సీఆర్‌బీ నివేదిక పేర్కొన్నది. 2004లో 2,030 మంది, 2005లో 1,802, 2006లో 1,932 మంది, 2007లో 1,071, 2008లో 1,575 మంది, 2009లో 1213, 2010లో 1,536 మంది, 2011లో 1,316 మంది, 2012లో 1,576 మంది, 2013లో 2,014 మంది, 2014లో 449 మంది రైతులు కలిపి మొత్తం 16,494 రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలతో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. 2014 జూన్ 2 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కేవరకు 6,703 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రేవంత్ ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాదిలోనే ఏకంగా 436 మంది రైతులు నేలకొరిగారు. ఈ గణాంకాలను బట్టి ఉమ్మడి ఏపీలో పెరిగిన రైతు ఆత్మహత్యలు.. ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ హయాంలో తగ్గుముఖం పట్టినట్టు తెలుస్తున్నది. మళ్లీ కాంగ్రెస్ పాలన రాగానే అన్నదాతలు సమస్యల వలయంలో చిక్కుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీటికి ఇంతటితో ఫుల్‌స్టాప్ పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.

(వ్యాసకర్త: సామాజిక కార్యకర్త)




# 'పతనమైనా' పర్లేదా?



మార్కెట్లు పతనమవడంతో ఇన్వెస్టర్లు రూ.7.46 లక్షల కోట్ల రూపాయలు నష్టపోయారు. అయినా పర్లేదు. కేంద్ర ఆర్థిక మంత్రికి దాని గురించి పట్టించుకొనే తీరిక ఉండదు. ప్రధాని కుంభ మేళా గురించి రాయడంలో బిజీగా ఉన్నారు. అటు ఆదాయ పన్ను శాఖ మనం డిన్నర్‌లో ఏం తింటున్నామో తనిఖీ చేయడంలో తలమునకలై ఉంది. ఇంకో పక్క నాయకత్వాన్ని మార్చడంలో సెబీ బిజీగా ఉంది.

- ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ ఎంపీ, శివసేన (యూబీటీ)



# మన స్వప్నం సాకారమైన వేళ



ఓ.నరసింహా రెడ్డి
80080 02927

**2014, మార్చి 1.. తెలంగాణ ప్రజల అరువై ఏండ్ల స్వప్నం సాకారమైన రోజు. పార్లమెంట్ ఉభయసభల్లో పాసైన తెలంగాణ బిల్లును రాష్ట్రపతి ఆమోదించి గెజిట్ ప్రకటించిన రోజు. తెలంగాణ సంస్కృతి, భాష, చరిత్రపై ఆంధ్రా వలస పాలకులు చేసిన విధ్వంసాన్ని భరించిన తెలంగాణ స్వేచ్ఛా వాయువులను పీల్చిన రోజు.**

సమైక్య పాలకులు, పెట్టుబడిదారులు ఢిల్లీలో తిష్ట వేసి బిల్లును అడ్డుకోవటానికి ప్రయత్నించి.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి తల వంచక తప్పని పరిస్థితుల్లో చిక్కుకున్నారు. ఆ రోజు ప్రతిపక్షంలో ఉన్న కొందరు నాయకుల మద్దతుతో ఎలాగైనా బిల్లుకు మోకాలడ్డటానికి చేసే ప్రయత్నంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో కూడా డిమాండ్ చేయకుండా తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వాళ్లెందరో.. కానీ, తెలంగాణ ప్రజల దశాబ్దాల పోరాటానికి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పలేదు. అమరుల త్యాగాలు, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన ఈ రోజు చరిత్ర పుటల్లో నిలిచిపోయే రోజు. తెలంగాణ ప్రజలకు తమ ఉద్యమంపై నమ్మకం ఉన్నప్పటికీ ఇందిరాగాంధీ హయాంలో ఎలాగైతే ఉద్యమాన్ని చల్లార్చే ప్రయత్నం చేశారో అలాగే 2011 నుంచి 2014 వరకు తెలంగాణ ప్రజల్లో చిన్న అనుమానం ఉండేది. కానీ 'ఔర్ ఏక్ ధక్కా తెలంగాణ పక్కా' అంటూ నినదించిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆంధ్రా పెత్తందారుల ఆశలను కకావికలం చేసి తెలంగాణ సాధించారు. కాంగ్రెస్ నేతృత్వంలో నెహ్రూ తెలంగాణను విలీనం చేస్తే.. ఇందిరా గాంధీ ఆ గాయాలపై మరింత కారం చల్లారు. 2009 నుంచి తెలంగాణ ఇస్తామని ఏదో మాట వరుసకు చెప్పిన కాంగ్రెస్ ఎంతోమంది విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకున్నది.

పద్నాలుగేండ్లు ఉద్యమాన్ని ఉగ్రరూతలూగించి దేశంలోని అన్ని ప్రధాన పార్టీలను ఒప్పించిన కేసీఆర్ తొలి తెలంగాణ ప్రభుత్వానికి రథసారథిగా మారారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడిన తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా ప్రాజెక్టుల నిర్మాణం, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. దేశంలోనే భారీ ప్రాజెక్టుగా కాళేశ్వరం ద్వారా గోదావరి నదికి జీవం పోశారు. కాకతీయుల నుంచి ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ విలీనం ముందు వరకు గొలుసు కట్టు చెరువులతో సస్యశ్యామలంగా ఉండే తెలంగాణ ప్రాంతం ఆంధ్రా పాలనలో వెనుకబాటు గురైంది. దీనికి విరుగుడుగా 'మిషన్ కాకతీయ' అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన కేసీఆర్ ఆ చెరువులన్నింటినీ పునరుద్ధరించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో భూగర్భ జలాలు పెరగటాన్ని నీతి ఆయోగ్ సహా అన్ని కేంద్రసంస్థలు గుర్తించాయి. గత 75 ఏండ్లలో దేశంలో సాగు భూమి 7.7 శాతం పెరిగితే కేవలం పదేండ్లలో తెలంగాణలో 117 శాతం సాగు భూమి వినియోగంలోకి వచ్చింది.

> **హైదరాబాద్‌ను బంగారు బాతుగా, రియల్ ఎస్టేట్ ఆదాయ వనరుగా చూసిన బాబు లాంటి వాళ్లకు ఐటీ అభివృద్ధి అంటే ఏమిటో చూపించారు కేసీఆర్. ఒకప్పుడు హైదరాబాద్ అంటే ట్రాఫిక్, మత ఘర్షణలు గుర్తుకువచ్చేవి. కానీ, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మచ్చుకైనా ఇలాంటి ఘటనలు కనిపించలేదంటే ఆ ఘనత తెలంగాణ సోయి ఉన్న కేసీఆర్‌కే సొంతం. టీహబ్ లాంటి వినూత్నమైన ఆలోచనలతో ఐటీ రంగం దేశంలోనే అగ్రగామిగా ఎదిగింది.**

2014లో హైదరాబాద్ కేంద్రంగా రూ.57 వేల కోట్ల ఐటీ ఎగుమతులు జరిగితే 2023లో రూ.2,41,275 కోట్ల ఎగుమతులు జరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలో స్థానిక రిజర్వేషన్లు వలస పాలకులు కొల్లగొడితే... కేసీఆర్ భవిష్యత్ దృక్పథంతో 95 శాతం రిజర్వేషన్లను స్థానికులకు కేటాయించారు. రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి పదేండ్లలో రెండున్నర లక్షల ఉద్యోగాలను భర్తీచేశారు. కేసీఆర్ కిట్లు, కంటివెలుగు, బస్తీ దవాఖానాలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్, నూతన మెడికల్ కళాశాలలు నిర్మించారు. ఇవన్నీ తెలంగాణ ప్రజలకు ఆరోగ్యాన్ని అందించటానికి బీఆర్ఎస్ చేసిన గొప్ప కార్యక్రమాలు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతితో గ్రామీణ, పట్టణ పరిసరాలను పూర్తిగా మార్చేశారు. జాతీయస్థాయిలో 20 ఉత్తమ గ్రామ పంచాయతీలకు గానూ 19 తెలంగాణ నుంచే ఎన్నికవటం గర్వకారణం. హరిత తెలంగాణ నిర్మించే క్రమంలో 7.7 శాతం పచ్చదనాన్ని పెంపొందించారు. 2023 వరకు తెలంగాణ మోడల్ అభివృద్ధిని పాటించేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలు ముందుకువచ్చాయి. పదేండ్ల కాలంలో సాగు విస్తీర్ణం, భూగర్భ జలాలు, పంట దిగుబడులు, అక్షరాస్యత, శిశు మరణాల రేటు ఇలా చెప్పుకొంటూ పోతే ప్రతి రంగంలోనూ కేసీఆర్ తనదైన ముద్ర వేశారు.

కానీ, అలవి కానీ హామిలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇటు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, అటు అభివృద్ధిని కొనసాగించలేక చతికిల పడుతున్నది. పాలనపై ఎలాంటి పట్టు లేని రేవంత్ రెడ్డి అభివృద్ధిని కొనసాగించలేక పాలనను అస్తవ్యస్తంగా మార్చారు. కృష్ణా జలాలను ఆంధ్రా పాలకులు తరలించుకుపోతుంటే చేష్టలుడిగి చూస్తున్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ఖాళీ అయిన తర్వాత మేలుకున్న రేవంత్ అధికారులకు ఆదేశాలిచ్చి మాత్రం ఏం లాభం? గత పదేండ్లలో ఒక్క చుక్క కూడా అక్రమంగా తరలించుకుపోవటానికి ఆంధ్రా ప్రభుత్వాలు జంకాయి. కానీ, ప్రస్తుతం యథేచ్ఛగా నీళ్లు దోచుకుపోతున్నాయి. మరోవైపు కాళేశ్వరానికి మరమ్మతులు చేయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం రేవంత్ రెడ్డి పాకులాడుతున్నారు. పదేండ్లలో ప్రతి ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లుంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే యాసంగి పంటలు వేసుకోవద్దని అధికారులు సూచించే పరిస్థితికి తీసుకువచ్చారు.

ఇలాంటి ప్రభుత్వంపై పోరాటాలు చేయటానికి బీఆర్ఎస్ శాయశక్తుల కృషిచేస్తున్నది. లగచర్ల లాంటి ఘటనలు సహా సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మరణాలపైనా పోరాడుతున్నది. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడేందుకు బీఆర్ఎస్‌తో కలిసి నడిచేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు సహా కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బీఆర్ఎస్ చేస్తున్న పోరాటానికి ప్రజలు బాసటగా నిలుస్తున్నారు.

(నేడు తెలంగాణ రాష్ట్ర బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్రపడిన రోజు)